
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 124 వ భాగం

## పురంజనోపాఖ్యానం 17

పురంజనుడు సంసారంలో కూరుకుని పిల్లలని, మనుమలని చూసుకుంటూ ఇదే జీవితం అనుకుంటూ పురుషార్థం, అంటే భగవంతుణ్ణి తెల్సుకునే ప్రయత్నం ఏదీ చేయకుండా, మమకారం పెంచుకున్నాడు. ఇంకా ఈయన చేసిన పనులేమిటంటే,

ච.తిరమగు నిష్ఠతో నతఁడు దీక్షితుఁడై పశుమారకంబులున్
సరవి భయంకరంబులగు సన్మఖముల్ దగఁ బెక్కు చేసి యా
దరమున నీవునుం బలెను దత్తదనూన ఫలాప్తి కాముఁడై
సురపితృ భూత సంఘము నసూయఁ దనర్చ భజించె భూవరా! [4-809]

భయంకరమైన యజ్ఞాలు (మఖములు) చేస్తూ పశువులని చంపుతూ వచ్చాడు నీలాగే. ఎవరికోసం అంటే దేవతలకోసం, పితృలకోసం, భూతాలకోసం (సురపితృ భూత సంఘము).

వ. ఇట్లాత్మహితంబు లైన కర్మంబులయం దనవహితుండును గుటుంబాసక్త మానసుండునై యున్న యతనికి విరోధియై ప్రియాంగనా జనంబులకును నప్రియంబగు కాలంబు సంభవించినం జండవేగ విఖ్యాతుండను గంధర్వాధీశుండు షష్ట్యుత్తర శతత్రయ సంఖ్యాకులైన గంధర్వులును నందఱ గంధర్వీజనంబులును సితాసిత వర్ణంబులు గలిగి మిథునీభూతు లగుచు ననుగమింపం జనుదెంచి స్వపరిభ్రమణంబు చేతనే సర్వకామంబుల నిర్మితంబగు నా పురంబు నిరోధించిన నప్పుడా చండవేగానుచరు లైన గంధర్వు లా పురంజను పురంబు వ్యాకులత్వంబు నొందించుచు నపహరింప నుపక్రమించు సమయంబునఁ బురంజన పురాధ్యక్షుండైన ప్రజాగరుం డనువాడు వింశత్యుత్తర సప్తశతంబులైన గంధర్వ గంధర్వీ జనంబుల నివారించి బలవంతుండై సంవత్సరశతంబు యుద్ధంబు గావించి యొక్కరుం

డయ్యు నప్పెక్కంద్రతో నిట్లు పోరి క్షీణుండైనం బురంజనుండు దాన నిలిచి తత్పురంబున నల్ప సుఖంబు లనుభవించుచుఁ బాంచాల దేశంబు లందు నిజపార్షదుల చేత నానీతంబు లైన పదార్థంబుల నొందుచుం గామినీ జనసమేతుండై భయపర్యాలోచనంబు చేయ నేరక రాష్ట్ర పుర బాంధవ సమేతుండై యార్తి నొంది చింతాక్రాంతుండై యుండె; నంత.

[4-810]

ఇలా కాలం గడిచిపోతున్నంతలో అప్రియమైన కాలం సంభవించింది. రోజులు బాగాలేవు అనుకుంటాం చూడండి, అలాగన్న మాట. ఈ లోపుల చండవేగుడనేవాడు మూడువందల అరవైమంది (షష్ట్యుత్తర శతత్రయ – శతత్రయ – మూడు వందలు, షష్టి – అరవై) గంధర్వులతో, మరో అంతమంది గంధర్వ స్త్రీలతో పురం మీద దాడి చేసారు. మొదట్లో మహిషి కూడా ఐదు తలలపాము గుర్తుంది కదా? అంటే ప్రజాగరుండు – వీళ్లమీద దాడి తట్టుకుని వందేళ్ళు (సంవత్సర శతంబు) పోరాడాడు గానీ బలం సరిపోక క్షీణించాడు. ఇది చూసి కూడా పురంజనుడు ఏమీ పట్టించుకోకుండా తన స్వంత సుఖాల్లో మునిగిపోయి బంధువులతో ఉండి చింతాక్రాంతుడయ్యాడు. ఇది అలా ఉంచుదాం. ఈ పురం కొల్లగొట్టడానికి మరో చిన్న కథ ఉంది.

క. అనయంబుఁ గాల పుత్రిక
యను నొక కామిని వరేచ్ఛ నఖిల జగంబుం
దనయంతఁ గలయఁ దిరుగుచుఁ
జనిచని యొకనాడు రాజసత్తమ! వింటే. [4-811]

కాలుడి కూతురు ఒకావిడ ఉంది. ఆవిడ తనకి కావాల్సిన మొగుడి కోసం మొత్తం జగాలన్నీ (అఖిల జగంబు) కలయతిరుగుతూ ఉండేది. అలా తిరుగుతున్న రోజుల్లో మరో విషయం జరిగింది.

సీ. అనఘాత్మ! రాజర్షి యైన యయాతి కు
మారకుం డయినట్టి పూరుచేత
వరియింపఁగాఁ బడి వలనొప్ప నతనికి
వర మిచ్చి దౌర్భాగ్యవశత నొంది
ప్రఖ్యాతి గనుట దుర్భగ యనుపేరను

బరఁగు న క్కాంత నే పురుషవరుఁడు
వరియింపఁ డయ్యె; నా తరుణియు నొకనాఁడు
గర మొప్ప బ్రహ్మ లోకమున నుండి [4-812]

తే. వసుధ కేతెంచి విను బృహద్వ్రతుఁడ నయిన
నన్ను వరియింపఁ గోరి మనమునఁ గామ
శరవిమోహిత యై వేఁడఁ గరము నేను
సమ్మతింపక యున్న రోషమున నలిగి. [4-812.1]

ఈ కాలుడి కూతురు రాజర్షి అయిన యయాతి కొడుకు పూరుణ్ణి వరించింది. ఆ తర్వాత ఆయనకి వరం ఇచ్చి వెళ్ళిపోవడం చేత ఆవిడకి దుర్భగ అని పేరు వచ్చింది. దుర్భాగ్యమైన పరిస్థితి కల్పించేది కనక దుర్భగ అనే ప్రఖ్యాతమైన పేరుట ఆవిడకి. ఆ తర్వాత ఆవిడని ఎవరూ వరించలేదు. అప్పుడు నా దగ్గిరకి (అంటే ఈ కథ చెప్పే నారదుడి దగ్గిరకి) వచ్చి 'నన్ను పెళ్ళి చేసుకో' అని అడిగింది కానీ నేను వప్పుకోలేదు. అందువల్ల ఆవిడకి కోపం తెప్పించిన వాడినయ్యాను. ఈ కథ మరింత వింతగా ఉందా? అయితే ఓ సారి వెనక్కి వెళదాం.

దేవయాని రాక్షసుల గురువు అయిన శుక్రాచార్యుడి కూతురు. కచుడు దేవలోకం నుంచి వచ్చి శుక్రుడి దగ్గిర చేరాడు యుద్ధంలో చనిపోతున్న దేవతలని బతికించడానికి శుక్రుడి దగ్గిర ఉన్న మంత్రం నేర్చుకోవడానికి. దేవయాని కచుణ్ణి పెళ్ళిచేసుకోమంటే కచుడు వప్పుకోడు. నువ్వు గురువు కూతురువి కనక నాకు సోదరి కింద లెక్క అని చెప్తాడు. ఇలా జరిగినందుకు ఏడుస్తున్న రోజుల్లో రాజైన వృషపర్వుడి గారి కూతురు శర్మిష్ట దేవయానిని అవమానిస్తుంది – నువ్వూ మీ నాన్నా మా మోచేతి నీళ్ళు తాగి బతుకుతున్నారు అని. శుక్రాచార్యుడుకి కోపం వచ్చి రాజ్యంలోంచి వెళ్ళిపోతే శర్మిష్ట తండ్రి శుక్రాచార్యుడి కాళ్ళు పట్టుకుని బతిమాలి, తన కూతుర్ని దేవయానికి సేవకురాలిగా ఉండేటట్టు అనుమతించి ఈ ఇద్దర్నీ మళ్ళీ రాజ్యానికి తీసుకొస్తాడు. మరో సారి ఈ శర్మిష్టకీ, దేవయానికీ గొడవలు అవుతాయి ఏదో విహారయాత్రలో – కంగారులో ఒకరి బట్టలు ఒకరు కట్టుకున్నాక అవి తారుమారైనట్టు గ్రహించినప్పుడు. దేవయానిని ఒక పాడుబడిన నూతిలో తోసేసి శర్మిష్ట ఇంటికి వెళ్ళిపోతుంది. అటుగా వచ్చిన యయాతి దేవయానిని పైకి తీస్తాడు. ఈ యయాతి శుక్రుడి కూతురు దేవయానిని పెళ్ళి చేసుకుంటాడు ఉత్తరోత్తరా.

అయితే కొన్నాళ్ళకి ఈ యయాతి దేవయాని తో ఉంటూ సేవకురాలైన శర్మిష్టని కూడా రహశ్యంగా చేరదీస్తాడు. ఇది తెలిసి శుక్రాచార్యుడు శాపం పెడతాడు – తక్షణం ముసలివాడివి అయిపో అని. నేను చేసినది తప్పే, కానీ ఇంకా నాకు కోరికలు తీరలేదు, కాస్త కనికరించండి అని యయాతి శుక్రుడి కాళ్ళు పట్టుకుంటే ఆయన చెప్తాడు. నీ కొడుకులలో ఎవరికైనా నీ ముసలితనం ఇచ్చి వాళ్ల యౌవనం తీసుకో కొంతకాలం అని.  ఉన్న కొడుకుల్లో ఎవరూ ఒప్పుకోరు, ఒక్క పూరుడు (లేదా పురూరవుడు) అనేవాడు తప్ప. అలా అతని యౌవనం తీసుకుని తన ముసలితనం ఇస్తాడు యయాతి. ఇదే పైన వచనంలో చెప్పిన పూరుడు కాలుడి కూతుర్ని వరించడం అంటే. ముసలితనం ఎవరిక్కావాలి? అందుకే ఎవరూ ఆవిడని చేసుకోకపోవడం. అయితే కొంతకాలానికి యయాతికి ఈ కోరికలతో విసుగెత్తి 'ఒరే అబ్బాయి ఇవి ఎంత అనుభవించినా తీరేవి కాదు; నేను సన్యాసం తీసుకుని తపస్సు చేస్తా నీ యౌవ్వనం నువ్వు తీసుకో' అని తిరిగి ఇచ్చేస్తాడు పూరుడికి. ఇదే ముసలితనం పూరుణ్ణి వదిలేయడం అంటే. అలా పూరుడు యవనం తీసుకున్నాక తండ్రి పూరుడికే రాజ్యం ఇచ్చి మిగతావారిని రాజ్య భ్రష్టులిగా చేస్తాడు. పూరుడి పేరు మీదే కురు వంశం మొదలైందనేది మిగతా కథ.

పూరుణ్ణి వదిలేసిన తర్వాత ఆ ముసలితనం నారదుడి దగ్గిరకి వచ్చింది. కానీ నారదుడు నారాయణ స్మరణంతో అప్పటికే సన్యాసి. నాకు భగవంతుడు తప్ప ఇంకేమీ అక్కర్లేదు నీ దారిన నువ్వు వెళ్ళు అని నారదుడు విష్ణు సాయుజ్యం పొందాడు. అదే 'నన్ను వరించమంటే నేను తిరస్కరించాను' అని చెప్పాడు వచనంలో.  అయితే ఆవిడకి కోపం వచ్చి నన్ను ఇలా అంది.

వ. ఇట్లను "మునీంద్రా! మదీయాశా విముఖుండవైన నీకు నేకత్రావస్థానంబు లేక యుండుంగాక" యని శపించి విహత సంకల్పయై మదుపదేశంబునం జని యవనేశ్వరుండును భయనామకుండును నయిన వానిం గదిసి యిట్లనియె.

[4–813]

నువ్వు నన్ను వద్దన్నావు కనక ఒక స్థిరమైన స్థావరం అంటూ లేకుండా తిరుగుతూ ఉండు అని శపించింది. ఎందుకంటే నా కోరిక తిరస్కరించావు కనక (మదీయాశా విముఖుండు). ఆ తర్వాత నా ఉపదేశం విని యవనేశ్వరుడు అయిన భయుడు అనే పేరు గలవాడి దగ్గిరకి వెళ్ళి ఇలా అంది. దుర్భగ ఇలా శాపం పెట్టినా నారదుడు ఆవిడకి ఉపదేశం చేయడం గమనించారా? అదే గురువుల అద్భుతమైన కరుణ కి ఉదాహరణ. పేరు గమనించారా? భయుడు. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు కనక ఆ పేరు.

క. అవనీపతి! భయనామక
యవనకులాధీశ్వరుండ వగు నినుఁ బతిఁగాఁ
దవిలి వరింపఁగ వచ్చితి
సవినయముగ వినుము భూత సంకల్పమునన్. [4-814]

వ. కలుగు మత్కామితంబు వృథగాదు; లోకంబున వేదంబు లందు దేయగ్రాహ్యరూపం బైన వస్తువు యాచ్యమానం బగుచుండ నెవ్వం డొసంగం; డెవ్వం డిందు దీయమానం బగుచుండం గోరం; డట్టి వీర లిద్దఱును జడస్వభావులని సత్పురుషులు శోకంబు నొందుదురు; కావున నిన్ను భజియించుచున్న నన్నుం గరుణార్ద్రచిత్తుండవై భజియింపు; మిట్టి యార్తానుకంపయుఁ బురుషధర్మం" బని పలికిన యక్కాలపుత్రిక వచనంబులు విని యవనేశ్వరుండు దేవగుహ్యచికీర్షు వగు దానిం గనుంగొని మందస్మిత వదనుం డగుచు నిట్లనియె. [4-815]

ఆవిడ భయుడి దగ్గిరకి వెళ్ళి, నిన్ను వరించడానికి వచ్చాను. ఇవ్వదగిన వస్తువును (దేయగ్రాహ్యరూపంబైన) అడిగినప్పుడు (యాచ్యమానంబగుచుండ) ఇవ్వనివాడు, గ్రహింప దగిన ఇచ్చిన వస్తువు తీసుకోనివాడు; వీరిద్దరూ కూడా మంద బుద్ధులని చెప్తున్నారు. అదీగాక ఇది పురుష ధర్మం కూడా అందువల్ల నన్ను గ్రహించు అంది. ఈ భయుడనేవాడు దేవరహశ్యం (దేవ గుహ్య చికీర్షువు) బట్టబయలు చేసే ఆ కాలపుత్రిక ని చూసి నవ్వుతూ ఇలా చెప్పాడు. మరో సారి ఆలోచిస్తే ముసలితనం (పేరు గమినించారా? దుర్భగ – ద్వేషింపతగినది) ఎవరిక్కావాలి? అందులోనూ యవ్వనంలో ఉన్నవార్ని ముసలితనం తీసుకుంటావా అని అడిగితే ఏమంటారు?

క. విను; తరుణి! యాచ్యమానం
బనఁదగు నీ లోకమందు నత్యశుభవు స
జ్జనముల కసమ్మతవు నగు
నిను నభినందింపకుండ్రు నెఱి నెవ్వారున్. [4-816]

వ. కావున నేను జ్ఞానదృష్టిం జేసి నీకుం బతినిరూపణంబు చేసెద; నది యెట్లనిన మదీయసేనా సాహాయ్యంబు బడసి ప్రజానాశం బొనరించు నట్టి నీ వవ్యక్తగతివై కర్మనిర్మితంబైన లోకంబు ననుభవింపు; మీ ప్రజ్వారుం దనువాఁడు

నాకు సహోదరుండు; నీవు మదీయ భగినివి; మీరిద్దఱం గూడి యీ లోకంబునందు నవ్యక్తుండును భీమసైనికుండును నై యేను వర్తింతు"ననిన నా భయనామకుం డయిన యవనేశ్వరుని దిష్టకారులైన సైనికులు ప్రజ్వార కాలకన్యా యుక్తులై భూమండలం బెల్లఁ దిరుగుచు నొక్కనాఁ డతివేగంబున భౌమ భోగాఢ్యంబును జరత్పన్నగ పాలితంబును నయిన పురంజను పురంబు నావరించి యున్నంత స్వాభిభూతుండయిన పురుషునకు నిస్సారత్వంబు గలిగించు నట్టి కాలకన్యక బలాత్కారంబున నా పురంజను పురంబు ననుభవించె; నట్లు కాలకన్య కోపభుజ్యమానం బైన పురంబు సర్వ ద్వారంబు లందును సర్వతోధికంబుగా నయ్యవనులు ప్రవేశించి తత్పురంబు సమస్తంబును బీడింప నిట్లు పురంబు ప్రపీడ్యమానం బగుచుండ నభిమానియైన పురంజనుండు. [4-817]

నువ్వు అశుభమైన దానివి కనక లోకంలో ఎవరూ కూడా నిన్ను ఎవరూ మెచ్చుకోవడం లేదు. అయితే నేను జ్ఞాన దృష్టితో చూసి నీ భర్త ఎవరో నిర్ణయిస్తాను. నా సైన్యంతో పాటు ఈ లోకంలో సంచరించు. ఈ ప్రజ్వరుడు అనేవాడు నా సోదరుడు; నువ్వు నా చెల్లెలి కింద లెక్క. మీరిద్దరి వెనకా నేను కనిపించకుండా (అవ్యక్తుడనై) లోకంలో సంచరిస్తాను. అలా ప్రజానాశనం జరుగుతుంది. ఈ విధంగా ఈ ముగ్గురూ భూమండలం అంతా తిరుగుతున్నారు.

మళ్ళీ కథలోకి వద్దాం. అలా నిస్సారత్వం కలిగింగించే ఈ కాలుడి కూతురు పురంజనుడి మీద బలాత్కారంగా దాడి చేసింది. ఈ విధంగా పురం అంతా నాశనం కావడం మొదలైంది. అయితే తన పురం అంటే అభిమానం ఉన్న పురంజనుడు ఏమి చేసాడు? అది వచ్చే వ్యాసంలో చూద్దాం

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS